తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
మంగళవారం
2 డిసెంబర్ 2025
Follow :



# జర్నలిస్టుల హక్కుల కోసం
# డిసెంబర్ 3న మహాధర్నా

## సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ నిరసన

- ఆరోగ్య బీమా, అక్రిడిటేషన్, ఇండ్ల స్థలాలపై పోరాటం
- రెండు ప్రభుత్వాల నిర్లక్ష్యం.. టీయూడబ్ల్యూజే ఆగ్రహం
- మేడ్చల్ కలెక్టరేట్ వద్ద పోస్టర్ ఆవిష్కరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 01 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపై కొనసాగిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ డిసెంబర్ 3న సమాచారం శాఖ ఐజేయూ కమిషనర్ కార్యాలయం ఎదుట జరగనున్న జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాం రెడ్డిలు పిలుపునిచ్చారు, ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల జర్నలిస్టులు భారీగా హాజరయ్యారు, తెలంగాణ సాధించిన తరువాత జర్నలిస్టులు అత్యంత నిరాధారణకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ ఉమ్మడి రాష్ట్రంలో అమలైన హెల్త్ స్కీమ్, వృత్తి సంఘాలకు అందిన సదుపాయాలు, ఇండ్ల స్థలాలు, బీమా పథకాలు లాంటివన్నీ తెలంగాణ ఏర్పడిన తరువాత పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు, టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు అమలుకాకపోవడమే కాకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టుల కోసం చేయాల్సిన చర్యలు తీసుకోలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు, గుర్తింపు కార్డులకై అక్రిడేషన్ విధానం, ఆరోగ్య బీమా పథకం పునరుద్ధరణ, చిన్న మధ్య తరగతి పత్రికలకు రక్షణ, జర్నలిస్టుల భద్రత, ఇండ్లు-ఇండ్ల స్థలాలు, వృత్తి కమిటీల పునరుద్ధరణ వంటి కీలక అంశాలు రెండు ప్రభుత్వాల కాలంలో పట్టించుకోకపోవడం వల్లే మహా ధర్నా అవసరమైందని పేర్కొన్నారు, గత రెండేళ్లుగా సమాచారం శాఖ మంత్రిని పలుమార్లు కలిసి విన్నవించినా ఎటువంటి పరిష్కారం లభించకపోవడంతో హక్కుల కోసం పోరాటం తప్పని పరిస్థితి ఏర్పడిందని నాయకులు స్పష్టం చేశారు, వెంటనే జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు నాగేంద్ర చారి, స్టాఫర్లు కృష్ణ, రవి, రామారావు, రచ్చ శ్రీనివాస్, రవికిరణ్ రెడ్డి, రామకృష్ణ, యాదగిరి, నాయకులు వెంకట్ రెడ్డి, నర్సింగ్ రావు, గిరిబాబు, రవి, శ్రీధర్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## షాపూర్‌నగర్ పూర్ణిమ హైస్కూల్
# ఘటనపై విచారణ

### కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు



**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 1 (జనం సాక్షి):** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పూర్ణిమ ప్రైమరీ స్కూల్‌లో చిన్నారిపై ఆయా భౌతికంగా దాడి చేసి చిత్రహింసలకు గురి చేసిన జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు కారణమైంది.విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత,చందన వెంటనే స్పందించి ప్రాథమిక విచారణ చేపట్టారు.

**చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న అధికారులు..**

సంఘటన అనంతరం కమిషన్ సభ్యులు హాస్పిటల్‌కు వెళ్లి చిన్నారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు సేకరించారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పూర్తిస్థాయి న్యాయం జరుగుతుందంటూ హామీ ఇచ్చారు. ప్రైమరీ స్కూల్ పరిశీలనలో పలు విషయాలు వెల్లడైనట్లు తెలిపారు. పూర్ణిమ ప్రైమరీ స్కూల్‌కు వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. పాఠశాలలో సీసీ కెమెరాలు, పిల్లలకు అవసరమైన సురక్షిత వాష్‌రూమ్ సదుపాయాలు లేనట్టుగా గుర్తించారు. చిన్నారులను సంరక్షించడానికి కావాల్సిన సిబ్బంది సరిపడా లేకపోవడం,ఉన్న ఆయమ్మల పర్యవేక్షణ కూడా సరిగా లేకపోవడం,ప్రైమరీ స్థాయి పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఏ భద్రతా వ్యవస్థలు లేకపోవడం,ఈ పరిస్థితులను గమనించిన సరిత,చందన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యులు జీడిమెట్ల ఎస్ హెచ్ ఓ తో సమావేశమై ఘటనపై చర్చించారు.ఘటనకు కారణమైన ఆయమ్మపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే,పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని,చిన్నారులను రక్షించడంలో విఫలమైందని గుర్తించి,వారిపై కూడా కఠిన చర్యలు తప్పదని స్పష్టం చేశారు. "ప్రైవేట్ ప్రైమరీ స్కూల్స్ చిన్న పిల్లల భద్రతపై నిర్లక్ష్యం చూపడం పరిపాటిగా మారింది.కానీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు.పిల్లల భద్రత మా మొదటి ప్రాధాన్యం" అని అన్నారు. అధికారుల హాజరు - సమగ్ర విచారణ మొదలు ఈ పరిశీలనలో డీఈవో, డిసిపియు, సిడబ్ల్యూసి సభ్యులు, ఎంఈఓ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.స్కూల్ నిర్వహణ,సిబ్బంది బాధ్యతలు,భద్రతా ప్రమాణాలు,చిన్నారుల రక్షణ చర్యలపై వివరాలు సేకరించారు. స్థానికులు, తల్లిదండ్రులు కమిషన్ వేగవంతమైన స్పందనను అభినందిస్తూ,ఇలాంటి ఘటనలు తిరగరాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## అంబీయన్స్ ఫోర్ట్‌లో అక్రమ నిర్మాణ స్లాబులు తొలగింపు

**రాజేంద్రనగర్, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి హెచ్చరించారు.సోమవారం అత్తాపూర్ అంబీయన్స్ ఫోర్ట్‌లో అనుమతులు లేని అదనపు అంతస్తులు, సెట్ బ్యాక్ ఉల్లంఘనలపై జీహెచ్ఎంసీ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ శాఖ అక్రమ నిర్మాణ స్లాబులను కూల్చివేసింది.

## ఉద్యమకారుల కుటుంబాలకు అండగా ఉంటా : ప్రొ. కోదండరాం

- విలియమ్స్, దేవేందర్ కుటుంబాలను పరామర్శించిన టీజేఎస్ అధ్యక్షుడు





## సిపిఐ శతాబ్ది వేడుకల్లో క్రికెట్ టోర్నమెంట్ విజయం

**రాజేంద్రనగర్,డిసెంబర్1(జనంసాక్షి)** సిపిఐ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శంషాబాద్ మున్సిపాలిటీ తొండుపల్లోని ఎంపీ ఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో వారాంతం పాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్లో విజయం సాధించిన ఈగల్ వారియర్ జట్టుకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాల, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. యాదగిరి, బాసరాజు నరసింహ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నరగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్యపు ప్రభు, మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రు నాయక్ పాల్గొన్నారు.

## చందానగర్‌లో భారీ అగ్ని ప్రమాదం



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ నిర్మాణ సంస్థ పలు భారీ బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తోంది. అయితే అందులో పనిచేసే కార్మికులంతా అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. సోమవారం కార్మికులంతా భవన నిర్మాణ పనుల్లో మునిగి ఉండగా ఒక్కసారిగా అక్కడి గుడిసెలకు నిప్పు అంటుకొని మంటలు ఎగిసిపడి కార్మికుల కండ్ల ఎదుటనే దాదాపు 50 గుడిసెలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అయి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాద సమయంలో గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. జీవన ఉపాధి కోసం వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికుల గూడు అగ్నికి ఆహుతి కావడంతో కార్మికులు కన్నీళ్లు పెట్టుకొని బోరుణ విలపించారు. యజమాని భవన కార్మికులకు అండగా నిలబడి వారిని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

# భగవద్గీతా శ్లోకాలతో మార్మోగిన చేవెళ్ల

## ఘనంగా గీతా జయంతి మహోత్సవం

చేవెళ్ల, డిసెంబరు 01 (జనంసాక్షి) గీతా జయంతి హిందూ పవిత్ర గ్రంథం భగవద్గీత పుట్టినరోజు పర్వదినాన్ని పురస్కరించుకుని చేవెళ్ల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గీతయజ్ఞం నిర్వహించారు. గ్రామ హనుమాన్ దేవాలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్, చేవెళ్ల గ్రామ గీతావాణి, మాతృశక్తి, సేవికా సమితి సభ్యులు సామూహిక భగవద్గీతా పారాయణం చేశారు. గీతావాణి కమిటీ సభ్యులు మహిళా మణులు ఏకరూప దుస్తులు ధరించి 18 అధ్యాయాల భగవద్గీత శ్లోకాలను పటించారు. కన్న, శ్రీపాద పంతులు ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణలతో గీతా యజ్ఞము, హెూమం నిర్వహించారు. హరే రామ హరే రామ రామ రామ.. హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే, శ్రీ రామ జయ రామ నామ సంకీర్తనలతో చేవెళ్ల గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్తు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చేగురి భోజీరెడ్డి, వక్తపాటి కమాల్ రెడ్డి మాట్లాడుతూ...గీత సాక్షాత్తు శ్రీ కృష్ణ భగవానుని చేత పలకబడిందన్నారు. కురుక్షేత్ర యుద్ధ సందర్భంలో భగవానుడు అర్జునుడికి గీతోపదేశం చేశాడన్నారు.



భగవద్గీత పరమ ప్రామాణికమైన మానవ సమాజానికి దివ్యమార్గం చూపే పవిత్ర గ్రంథమన్నారు. పరమ పావనమైన గీత భగవానుని నోట వెలువడిన పుణ్య దినమైన మార్గశిర శుద్ధ ఏకాదశి రోజునే భగవద్గీత పుట్టినరోజుగా... గీతా జయంతి, గీతా యజ్ఞము చేసుకుంటున్నామన్నారు. ఈ రోజున ఆ పవిత్ర గ్రంథాన్ని సృజించినా పుణ్యం వస్తుందన్నారు. నిత్యం గీతా పఠనం ప్రభావాన్ని వర్ణించనలవి గాదన్నారు. మానవాళికి సర్వ సమస్యలకు పరిష్కారం చూపించే జగద్గురువు భగవద్గీత అనీ కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ కృష్ణ భగవానుడి నామ సంకీర్తనలతో తన్మయత్వం పొందారు.

## రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ కొనసాగుతుంది - మియాపూర్ ట్రాఫిక్ ఎస్హెచ్ఓ



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 01 (జనంసాక్షి) :** కొండాపూర్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ అంతకంతకూ పెరుగుతున్న విషయాన్ని గమనంలో పెట్టుకొని ట్రాఫిక్ నియంత్రణ నిమిత్తం పలు మార్పులను చేపడుతున్నట్లు మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాఫిక్ విభాగం మేడ్చల్ జోన్ డిసిపి రంజన్ రతన్ కుమార్ ఆదేశాల మేరకు కొండాపూర్ వైపు నుండి తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించడంలో భాగంగా సోమవారం నుండి కొండాపూర్ వైపు వెళ్లే వాహనాలను మదీనగూడ యూటర్న్ వద్ద మళ్లించడం జరుగుతుందని, మియాపూర్ పరిధి ఆల్విన్ కాలనీ చౌరస్తా వద్ద ఉదయం సాయంత్రం వేళల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ నెలకొని ఉంటున్నందున మియాపూర్ రైట్ ఆర్ 3 మార్గాన్ని మూసివేయడం జరిగిందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వివరించారు. అలాగే చందానగర్ వైపు ఫ్రీ లెఫ్ట్ ను పునరుద్ధరించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి అవకాశం ఉందని, తద్వారా వాహనదారులు సమయాభావం లేకుండా, ప్రశాంతంగా రాకపోకలు సాగించడానికి వీలు కలుగుతుందని ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు. ఈ మార్పులను వాహనదారులు, మియాపూర్, మదీనగూడ ప్రాంత ప్రజలు గమనించి పోలీసు అధికారులకు సహకరించాల్సిందిగా ఆయన సూచించారు.

## రీవైస్ టాక్స్‌లతో పెద్ద ప్రజలపై భారం పడుతుంది

### కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, డిసెంబర్ 01 (జనం సాక్షి)** హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీ క్రిష్ణ ను వారి కార్యాలయం లో జరిగిన ప్రజావాణి కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ రివైజ్ టాక్స్‌ల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారీ ఆర్థిక భారం పడుతుందని వారు పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఇంటి పన్ను చెల్లిస్తున్నప్పటికీ, ముందుగా ఎలాంటి సమాచారం లేకుండా ఇప్పటికిప్పుడు పెంచిన రీవైస్ టాక్స్ మూడు సంవత్సరాల ఇంటి పన్ను ఒకేసారి చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తూ పేద కుటుంబాలను వేధిస్తున్నారని ఆయన తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి ఎందుకు వసూలు చేస్తున్నారో అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం వలన ప్రజలను మరింత ఇబ్బందుల్లోకి నెడుతోందని వారు అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారంగా మారుతున్న ఈ నిర్ణయాన్ని వెంటనే పునః పరిశీలించాలని సంబంధిత అధికారులను వారు కోరారు. ఈ కార్యక్రమం లో వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి పెద్ద తండా గ్రామపంచాయతీ ఏకగ్రీవం

### కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నేనావత్ సురేఖ రవి

**దోమ డిసెంబర్ 01 జనం సాక్షి :**
దోమ మండలపరిధిలో ని బ్రహ్మణపల్లీ పెద్ద తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఖరారైంది. సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యుల ందరినీ కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రహ్మణపల్లీ పెద్ద తండా పంచాయతీ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయినటువంటి నేనవత్ సురేఖ భర్త రవికి మరియు ఉప సర్పంచ్‌గా జరుప్లా రమేష్‌కి గ్రామ పెద్దలు యువకులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, ఎన్నికలు అవస రం లేకుండా స్వచ్ఛందంగా సర్పంచ్‌గా ఎంపిక చేయడంతో పాటు 8 మంది వార్డు సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.ఈ ఏకగ్రీవానికి సహకరించిన పెద్ద తండా గ్రామపంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**హయత్ నగర్, (జనం సాక్షి) :**
హయత్ నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కళాశాల నుండి మదర్ డైరీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఆర్.యాదగిరి హాజరైనారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.యాదగిరి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి, దాని లక్షణాలు, సోకే విధానం, అనర్థాలను, ప్రధానంగా యువత దాని బారిన పడకుండా ఏ విధంగా తమను తాము కాపాడుకోవాలో విద్యార్థులకు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిరా, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డా.మధు ధర్మపురి, అకాడమిక్ కోఆర్డినేటర్ డా.బి.నరసింహ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.ఇ.యాదగిరి రెడ్డి, డా.ఎస్. శారదా దేవి, ఎన్‌సిసి ఆఫీసర్ డా.ధనరాజ్, ఫిజికల్ డైరెక్టర్ డా.కే.అనిత, లైబ్రేరియన్ డా.ఏ.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



## మణికొండలో వైన్‌షాపులపై స్థానికుల ఆందోళన

**రాజేంద్రనగర్,డిసెంబర్1(జనం సాక్షి) :** మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని పైప్‌లైన్ రోడ్-లాలమ్మగార్డెన్-ఫ్రెండ్స్ కాలనీ కూడలికి అతి సమీపంలో వైన్ షాప్, బార్, సిటీ ఫ్రైడ్ హెూటళ్లు ఉండటం వల్ల ప్రతిరోజూ తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులతో టీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ అధ్యక్షుడు సీతారామ్ దూళిపాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ ప్రాంతంలో కొత్తగా మరో వైన్‌షాప్ ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారం రావడంతో స్థానికులు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయ కూడలిలో నిరసన చేపట్టారు. "వైన్‌షాపులు వద్దు - ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి", "ఎక్సైజ్ కమిషనర్ డౌన్ డౌన్" వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ వైన్‌షాప్ లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లైసెన్సులు రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించాల్సి వస్తుందని, దానికి అధికారులు పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రామస్వామి యాదయ్య, సత్యనారాయణ, నరసింహ రావు, కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీద నరేందర్, అందె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

### చందానగర్ డిసి




**శేరిలింగంపల్లి డిసెంబరు 01 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారాన్నిప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జిదార్లు అందజేసే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని చందానగర్ సర్కిల్ డిసి శశిరేఖ సంబంధించిన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం చందానగర్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉప కమిషనర్ తో పాటు రెవెన్యూ విభాగం ఏఎంసి మణికరణ్, ఏసిపి నాగిరెడ్డి, సర్కిల్ వైద్యాధికారి రవి, ఇంజనీరింగ్ విభాగం అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రజావాణిలో భాగంగా టైటానిక్ విభాగానికి సంబంధించి 06, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన 02, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒకటి ఫిర్యాదులు అందాయని, వీలైనంత త్వరగా వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని డిసి శశిరేఖ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ, యూబిడి విభాగం, విద్యుత్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కుటుంబాలకు అండగా ఉంటా: ప్రొ. కోదండరాం

### విలియమ్స్, దేవేందర్ కుటుంబాలను పరామర్శించిన టీజేఎస్ అధ్యక్షుడు



**అల్వాల్, డిసెంబర్ 1 (జనంసాక్షి):** ఉద్యమకారుల కుటుంబాలకు అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. తొలి మలిదశ ఉద్యమకారుడు విలియమ్స్, అల్వాల్ ఉద్యమకారుడు దేవేందర్ అనారోగ్యంతో ఇటీవల మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన సోమవారం వారి నివాసాలకు చేరుకుని కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ప్రభుత్వ స్థాయిలో మాట్లాడి ఉద్యమకారుల కుటుంబాల బాధలను తగ్గించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డి, మల్కాజిగిరి నియోజకవర్గ ఫోరం అధ్యక్షుడు పుట్నాల కృష్ణ, ఉద్యమకారులు మంద శోభన్ బాబు, డోలి సుదీర్, భాస్కరరావు, బాబు, రామయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

## యాలాల్ మండల ప్రజలకు ఎస్సై విట్టల్ రెడ్డి కీలక సూచన



**యాలాల్ డిసెంబర్ 1 ( జనం సాక్షి ) :** గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు యాలాల మండల ఎస్సై విట్టల్ రెడ్డి కీలక సూచన చేశారు. ఎన్నికల సమయంలో గ్రామాలలోని ప్రజలు మరియు యువత వాట్సాప్, ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్ మొదలైన సోషల్ మీడియా వేదికలను ఎంచుకొని ఒక వర్గం వారి మీద మరియొక వర్గం వారు రెచ్చగొట్టడం కానీ, విద్వేష పూరిత వ్యాఖ్యానాలు కానీ, వర్గ వైశమ్యాలను కించపరుస్తూ పోస్టులు కానీ వీడియోలు కానీ పెట్టిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా వాట్సాప్ గ్రూప్ లలో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యానాలు పెడితే గ్రూప్ అడ్మిన్ లపై కూడా చర్యలు తీసుకొనబడతాయని హెచ్చరించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో గ్రామాలలోని ప్రజలందరూ సంయమనం పాటిస్తూ శాంతిభద్రతలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా సత్యనారాయణ చారి, ప్రధాన కార్యదర్శిగా బీరెల్లి కమలాకర్ రావు**

**వైద్య విద్యార్థుల రక్షణే ధ్యేయం : ర్యాగింగ్‌పై పోరాటం చేస్తామని ప్రకటన**




హైదరాబాద్ (జనంసాక్షి) : వైద్య విద్యార్థుల హక్కుల పరిరక్షణ, కళాశాలల్లో ర్యాగింగ్ నివారణే ప్రధాన అజెండాగా 'తెలంగాణ రాష్ట్ర మెడికో పేరెంట్స్ అసోసియేషన్' నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం నాగోల్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగామెడికో పేరెంట్స్ అసోసియేషన్ కొత్త కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లోజు సత్యనారాయణ చారి, ప్రధాన కార్యదర్శిగా బీరెల్లి కమలాకర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పొడిశెట్టి రమేష్ కుమార్, బొడ్డుపల్లి అంజయ్య, సుజాత, సంయుక్త కార్యదర్శులుగా టి. రత్న ప్రసాద్, గునుగుంట్ల శ్రీనివాస్ గౌడ్, నాగేందర్, యాదగిరి ఎన్నికయ్యారు. కోశాధికారిగా రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె. శ్రీధర్ రావు, ప్రచార కార్యదర్శిగా కె. వెంకట్రావు, కార్యదర్శిగా గడ్డం స్వప్న ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా జైపాల్ లాండే, పి. శ్రీనివాస రావు, న్యాయ సలహాదారుగా చెష్టి, ఈసీ సభ్యులుగా రవీందర్ రెడ్డి, నరహరి, దయానంద్, రవికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

**విద్యార్థులకు అండగా ఉంటాం: మల్లోజు**

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ చారి మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియలో తమ అసోసియేషన్ పూర్తి సహాయ సహకారాలు అందించిందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే స్పందించేందుకు వీలుగా ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక ఇన్‌చార్జిలను నియమించామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు.

**ర్యాగింగ్‌పై ఉక్కుపాదం: బీరెల్లి**

ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ భూతం విపరీతంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాగింగ్‌ను సమర్థవంతంగా అరికట్టేందుకు రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లా ఇన్‌చార్జిలు నిరంతరం పనిచేస్తారని, బాధిత విద్యార్థులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ప్రముఖ భారతీయ సూక్ష్మజీవ శాస్త్రవేత్త కన్నుమూత



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో రీసెర్చ్ ఎమిరిటస్ డైరెక్టర్, ప్రముఖ జీవ శాస్త్రవేత్త, సూక్ష్మజీవ శాస్త్ర నిపుణులు డాక్టర్ శివాజీ సిసింతి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. డాక్టర్ శివాజీ మరణంతో భారతదేశం ఒక ప్రతిభావంతమైన శాస్త్రవేత్తను కోల్పోయిందని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి ఎన్ రావు తెలిపారు. మేధస్సు, నిజాయితీ, వినయం ఈ మూడు అరుదైన గుణాలు కలిగిన వ్యక్తి అన్నారు. భవిష్యత్తు తరాల శాస్త్రవేత్తలకు ఆయన ఆదర్శప్రాయుడన్నారు. శివాజీ 375 పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలకు శాస్త్రీయ యాత్రల్లో పాల్గొన్న మొదటి భారతీయ జీవ శాస్త్రవేత్తగా ప్రసిద్ధి చెందారు. షిర్మాచర్ ఒయాసిస్ సమీపంలోని భారతదేశ దక్షిణ గంగోత్రి స్టేషన్‌లో ఆయన కొన్ని వారాలు గడిపారు. హిమాలయాలు, భూమి ధృవ ప్రాంతాలు, వాయు మండలంలో ఎత్తైన ప్రాంతాల్లో నివసించే సూక్ష్మజీవ సమూహాలపై, ముఖ్యంగా తక్కువ ఉష్ణోగ్రతల వద్ద అవి ఎలా జీవిస్తాయన్న అంశంపై చేసిన పరిశోధనలు భారత శాస్త్ర ప్రపంచంలో ఆయనకు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. ఈ కఠిన వాతావరణాల్లో మాత్రమే కనిపించే మూడు నూతన బ్యాక్టీరియా సమూహాలను ఆయన గుర్తించారు. జీవవిజ్ఞానంలో చేసిన విశేష కృషికి ఆయనకు 2002లో అంటార్కిటిక్ అవార్డు, 2014లో అసోసియేషన్ ఆఫ్ మైక్రోబయాలజిస్ట్స్, ఇండియా నుంచి కార్ల్ వోస్ మెమోరియల్ అవార్డు, 2016లో భారత ప్రభుత్వం ప్రదానం చేసిన పోలార్ సైన్సెస్ అండ్ క్రయోస్ఫియర్ నేషనల్ అవార్డు లభించాయి.



# ఆకట్టుకున్న నిఖితా ఏకపాత్రాభినయం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆమె నయనాలలో భావం, ఆమె కరములలో సంగీతం, ఆమె పాదాలలో లయ, ఆమె నడకలో కథ, ఆమె ఆత్మలో నృత్యం ప్రస్ఫుటమైందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అందుకే ఆ అభినయానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. ఆ నృత్య కౌశలానికి పరవశించిపోయారు. ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ఈ అద్భుత నృత్య ప్రదర్శన ఖైరాతాబాద్ లో ఉన్న భాస్కర ఆడిటోరియంలో జరిగింది. 'నవ జనార్ధన పారిజాతం' అనే ప్రత్యేక ప్రబంధాన్ని నర్తనశాల తరపున కుమారి సాయి నిఖితా కాటూరి ఏకపాత్రాభినయం ఎంతగానో ఆకట్టుకుంది. ఆంధ్రనాట్యం మహామహోపాధ్యాయుడు, భారత కళా ప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ పునరావిష్కరించి, లిఖితరూపం ఇచ్చిన ఈ నృత్యరూపకాన్ని ఆయన శిష్యుడు గురువు కళాకృష్ణ నృత్య దర్శకత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. నాలుగు భాగాలుగా నవ జనార్ధన పారిజాతాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో నర్తకి మొదట సత్యభామ కథాంశాన్ని పరిచయం చేశారు. కృష్ణుడు కోసం సిగ్గుతో కూడిన అంగీకారం, వెతుకులాట, వియోగం, చివరకు రాజీ పడటం, భక్తికి చేరుకోవడం వంటి సత్యభామ ప్రయాణాన్ని ఇందులో వర్ణించారు.

# లేబర్ కోడ్ల రద్దుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి


**మంత్రి వివేక్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**



**హైదరాబాద్, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను అమలు చేయవద్దని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు బి రాజశేఖర్, గుడిగ రఘు, పి రాధిక, స్టేట్ ఇ సి మెంబర్ మణిమాల, నాయకులు మేకల కృష్ణ తదితరులు సోమవారం హైదరాబాద్ లో కార్మిక ఉపాధి కల్పన శాఖా మంత్రి గడ్డం వివేక్ ను కలిశారు. లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని టి డబ్ల్యు జె ఎఫ్ నాయకులు మంత్రిని కోరారు. జర్నలిస్ట్ యాక్సిడెంట్ పాలసీని పునరుద్ధరించాలని, త్రైపాక్షిక కమిటీ నియమించాలని, కమిటీలో హెచ్‌యూజేకి ప్రాతినిధ్యం ఇవ్వాలని, కనీస వేతనాల జీవో సవరించాలని, రాత్రి వేళ మహిళా జర్నలిస్టులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలనీ కోరారు. ఈమేరకు టిడబ్ల్యుజెఎఫ్ బృందం మంత్రికి వినతిపత్రం అందజేసింది. మంత్రి స్పందిస్తూ, త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్మికశాఖ పరిధిలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి వివేక్ టిడబ్ల్యూజేఎఫ్ బృందానికి హామీ ఇచ్చారు.

# కాలుష్య భూతాన్ని కలసికట్టుగా తరిమేద్దాం

**(డిసెంబర్ 2 జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం)**



సృష్టిలో జీవం మనుగడ తీసుకునే శ్వాస మీద ఆధారపడి ఉంటుంది. ఆ శ్వాస పర్యావరణంపైనా ఆధారపడుతుంది. ఆ పర్యావరణం కాలుష్యం అయితే జీవం మనుగడ ప్రమాదంలో పడుతుంది, ఉనికే లేకుండా పోతుంది. అలాంటి కాలుష్యాన్ని నియంత్రించుకోవడానికి అవగాహనా కలిపించే విధంగా . ప్రతి సంవత్సరం డిసెంబర్ 2న జరుపుకునే జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం జరుపుకుంటారు. పర్యావరణం కాలుష్యమైతే గాలి, నీరు, నేల ప్రమాదకరంగా మారుతుంది, జీవించే ప్రాణులు తీసుకునే శ్వాస, ఆహారం అన్ని హానికరంగా మారుతాయి. ముఖ్యంగా కాలుష్యం పెరగడానికి కారణాలు కర్మాగారాలు, వాహనాలు, చెత్త మరియు రసాయనాలు వంటి వివిధ వనరులు. కాలుష్యం పర్యావరణ వ్యవస్థల సహజ సమతుల్యతను దెబ్బతీస్తుంది, రసాయనాలు, ప్లాస్టిక్‌లు లేదా వ్యర్థాలు వంటి హానికరమైన పదార్థాలు నదులు, సరస్సులు, మహాసముద్రాలు వంటి నీటి వనరులను కలుషితం చేసినప్పుడు నీటి కాలుష్యం సంభవిస్తుంది. కలుషితమైన నీరు జలచరాలను ప్రభావితం చేస్తుంది, పర్యావరణ వ్యవస్థలకు హాని కలిగిస్తుంది. త్రాగడానికి, ఇతర వినియోగాలకు, నీటిపారుదల కోసం దానిపై ఆధారపడే అందరికి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. హానికరమైన రసాయనాలు, వ్యర్థాలు, ఇతర పదార్థాలు నేల సారాన్ని, నాణ్యతను క్షీణింపజేసినప్పుడు నేలలో కాలుష్యం చేరుతుంది, కలుషితమైన నేల మొక్కల పెరుగుదలను ప్రభావితం చేస్తుంది, వ్యవసాయ ఉత్పాదకతను తగ్గిస్తుంది, పండించే పంటలో నాణ్యత తగ్గుతుంది, నేలలో నివసించే జీవులకు హాని కలిగిస్తుంది. ట్రాఫిక్, నిర్మాణం, పారిశ్రామిక యంత్రాలు, పెద్ద పెద్ద ధ్వనులతో వచ్చే సంగీతం, పెద్ద అర్థనాదాహాలతో నడిపే వాహనాలు కలిగించే హానికరమైన అధిక స్థాయి శబ్దాన్ని శబ్ద కాలుష్యంగా మారుతుంది. పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుంది, మనుషులమీద, జంతువుల మీద తీవ్ర ఒత్తిడి ఏర్పడి వినికిడి లోపానికి దారితీస్తుంది. వాతావరణంలోకి హానికరమైన వాయువులు, కణాలు , కార్బన్డయాక్సిన్ కలిగిన పేలుడు పదార్థాలు, వివిధ రసాయనాలను విడుదల చేయడం వాయు కాలుష్యం కాలుష్యం ఏర్పడి శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. మనిషి ప్రాణానికి కారణం అవుతుంది. వాతావరణ మార్పును వేగవంతం చేయడంలో వాయు కాలుష్యం కీలక పాత్ర పోషిస్తుంది. మానవులలో ఆరోగ్య సమస్యలు, జంతువుల అకాల మరణాలు, మొక్కల పెరుగుదల, ఆహారంలో విటమిన్లు లోపించడం లాంటి సమస్యలకు దారితీస్తుంది. ప్రతి ఒక్కరు కాలుష్య నియంత్రణ గురించి ఆవాహన పెంచుకోవాలి, ఇతరులకు అవహగాన కలిపించాల్సిన బాధ్యత ఉంది. కాలుష్యం గురించి అవగాహన పెంచడం. వివిధ రకాల కాలుష్యాలు – గాలి, నీరు, నేల మరియు శబ్దం మరియు ఆరోగ్యం, పర్యావరణ వ్యవస్థలు, వాతావరణంపై వాటి హానికరమైన ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం. భోపాల్ గ్యాస్ విషాద బాధితులను గౌరవించడం 1984లో జరిగిన విషాదకరమైన భోపాల్ గ్యాస్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారికి, బాధితులైన వారిని స్మరించుకోవడానికి, పరిశ్రమలలో కఠినమైన భద్రతా చర్యల అవసరాన్ని నిర్దిష్టంగా చెప్పాలి. పరిశుభ్రమైన పద్ధతులను ప్రోత్సహించడం పరిశ్రమలు, వ్యాపారాలు , వ్యక్తులు వ్యర్థాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించడం వంటి పర్యావరణ అనుకూల పద్ధతులను ఉపయోగించేలా ప్రోత్సహించడం. పర్యావరణ విధానాలకు మద్దతు ఇవ్వడం కాలుష్యాన్ని తగ్గించడం, సహజ వనరులను రక్షించడం లక్ష్యంగా చట్టాలకు, నిబంధనలకు మద్దతు ఇవ్వాలి. సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి, చెట్ల పెంపకం కార్యక్రమాలు, శుభ్రపరిచే ప్రచారాలు, రీసైక్లింగ్ కార్యక్రమాలు వంటి పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలలో సమాజాలను చురుకుగా పాల్గొనేలా ప్రేరేపించేలా చర్యలు తీసుకోవాలి. మానవాళికి, సమస్త జీవకోటికి నష్టం కలిగించే వాటి పట్ల ప్రభుత్వ చట్టాలు కఠినంగా రూపొందించాలి, అమలుపరచాలి. చిన్నప్పటినుంచే విద్యార్థులకు కాలుష్యం, పర్యావరణం గురించి బోధించాలి, ప్రతి ఒక్కరికి అవగాహనా కలిపించాలి.



**డాక్టర్. వై. సంజీవ కుమార్,**
**ఫౌండర్, ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్**
**9393613555, 9493613555**

# నిధులూ, విధులకే నా ప్రాధాన్యత

**కంజర్ సర్పంచ్ అభ్యర్థిగా బున్నె రవి రెండో సెట్ నామినేషన్ దాఖలు**



మోపాల్, డిసెంబర్ 1 (జనంసాక్షి) : గ్రామానికి నిధులు తెప్పించడంతో పాటు సర్పంచ్‌గా సమగ్ర బాధ్యతలు నిర్వర్తించేందుకు కృషి చేస్తానని కంజర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి బున్నె రవి అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆదర్శ గ్రామంగా నిలిపేందుకు శక్తివంచన లేకుండా పాటుపడతానని చెప్పారు. సోమవారం రోజున రెండోసెట్ నామినేషన్ దాఖలు చేసిన ఆయన మాట్లాడుతూ.. ఊరి సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడటంలో, గ్రామస్తుల ఆకాంక్షలకనుగుణంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని, జిల్లాలోనే కంజర్ గ్రామాన్ని అగ్రభాగాన నిలిపేందుకు అందరితో సమన్వయం చేసుకుంటానని అన్నారు. నామినేషన్ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామర్తి నర్సారెడ్డి, అంగల ఉదయ్ రెడ్డి, సర్కల భూమన్న, అదరంగి శ్రీనివాస్, సర్కల శ్రావణ్, రామర్తి నరేష్, మిద్దె ప్రవీణ్ పాల్గొన్నారు.

# పోల్కంపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కొండల్ గౌడ్

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసిన కాంగ్రెస్ అభ్యర్థి కొండల్ గౌడ్
- కాంగ్రెస్ పార్టీ బిసిలకు పెద్ద పీట వేస్తుంది : ఎమ్మెల్యే



ఇబ్రహీంపట్నం డిసెంబర్ 1 (జనం సాక్షి)

పోల్కంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గ బిసి నేత గుండ్ల కొండల్ గౌడ్ ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని ఇబ్రహీంపట్నం క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండల్ గౌడ్ కలవడం జరిగింది. ఈ సందర్భంగా మల్రెడ్డి రంగారెడ్డి కొండల్కి శుభాకాంక్షలు తెలుపుతూ గెలుపు కోసం కృషి చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని తెలిపారు. పది ఏండ్ల టిఆర్ఎస్ ప్రభుత్వం లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ప్రస్తుతం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు తెలిపారు. ఆడపడుచులకు బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రలోభాలకు లోను కాకుండా గ్రామం అభివృద్ధి కోసం కృషి చేసే పార్టీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కోరారు.. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు నేతలు పాల్గొనడం జరిగింది



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఎన్నికైన సందర్భంగా మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, వైస్ చైర్మన్ జి విఠల్ నాయక్ డైరెక్టరు పూర్ణ యాదవ్ లు సోమవారం తోటకూర వజ్రేష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాకేష్ యాదవ్, నాగరాజు యాదవ్, సాయి కుమార్ యాదవ్, సయ్యద్ ముర్తుజా, ప్రదీప్,రియాజ్, తదితరులు పాల్గొన్నారు. ( కాప్రా జనం సాక్షి )

# సీ.సీ కెమెరాల ఏర్పాటు ప్రజా భద్రతకు నిదర్శనం

**కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**హయత్ నగర్, డిసెంబర్ 01 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ ప్రగతి నగర్ కాలనీ, సంక్షేమ భవనంలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీ.సీ కెమెరాలను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, కాలనీ వాసులతో కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ కాలనీ ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి భద్రతాపరమైన చర్యలు తీసుకోవడం అభినందనీయం, నేటి కాలంలో ప్రతి ఇంటి, ప్రతి వీధి భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని వారు స్పష్టం చేశారు. ఇలాంటి ఆధునిక సదుపాయాలు కాలనీ అభివృద్ధికి, శాంతి భద్రతలకు బలమే కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేర నియంత్రణకు సహాయపడుతుందని, భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధి కోసం తగిన సహకారం అందిస్తానని వారు హామీ ఇచ్చారు. ప్రగతి నగర్ కాలనీ భద్రతా ప్రమాణాలను కొత్తస్థాయికి తీసుకెళ్లిన కాలనీ వాసుల చొరవ ప్రశంసనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షుడు అర్జున్ రావు, సైది రెడ్డి, రామ్ రెడ్డి, విద్యాసాగర్, రాధాకృష్ణ మూర్తి, విశ్వేశ్వర్ రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బాకారం సర్పంచ్ అభ్యర్థిగా ఎల్గని వెంకటేష్ గౌడ్ నామినేషన్



**మొయినాబాద్: నవంబర్ 019 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలకు నగార మోగడంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది, దీనిలో భాగంగానే ఆదివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని బాకారం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా బిజెపి మద్దతుతో అభ్యర్థిగా ఎల్గని వెంకటేష్ గౌడ్ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు, ఈ సందర్భం గా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న నిత్యం అందుబాటులో ఉండి సేవ చేయడం అవకాశం కల్పించాలని కోరారు, గ్రామంలోని యువకులు, మహిళలు, పెద్దలు ,ప్రతి ఒక్కరు ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు, బాకారం గ్రామాన్ని మొయినాబాద్ మండలంలోని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేశానన్నారు,

# ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన అవసరం



**కేశంపేట, డిసెంబర్ 1(జనం సాక్షి ) :** ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నిఖిత అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బంది గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా నిఖిత మాట్లాడుతూ.. హెచ్ఐవికి చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ ముర్తుజా, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు, పీహెచ్ఎన్ అంజిలమ్మ, సూపర్వైజర్ మెర్సి, ఎల్డి కంప్యూటర్ ఆపరేటర్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశంలో ఏడో ర్యాంక్ - తెలంగాణలో మొదటి స్థానం

### ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా నిలిచిన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్



**శామీర్ పేట్ ( జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఎంపిక చేసిన ఉత్తమ పోలీస్ స్టేషన్లలో శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ ఏడో స్థానాన్ని, తెలంగాణలో మొదటి స్థానాన్ని సాధించింది.పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదు లకు సమయానుకూల పరిష్కారం చూపించడం వంటి అంశాలను ఎంహెచ్ఏ పరిగణనలోకి తీసుకుంది. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, గార్డెనింగ్, ఉత్తమ సీసీటీఎన్ ఎస్ పని, సిబ్బంది నైపుణ్యం వంటి అంశాలు కూడా పరిశీలనలో ఉన్నాయి.ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేసే ఈ ప్రక్రియలో, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన శామీర్పేట్ పోలీస్ స్టేషన్ రాష్ట్రంలో అగ్రస్థానాన్ని, దేశంలో ప్రతిష్టాత్మకమైన ఏడో ర్యాంకును సాధించడం విశేషం.ఈ సందర్భంగా మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏడీసీపీ మేడ్చల్ పురుషోత్తం, ఏసీపీ మేడ్చల్ బాలగంగిరెడ్డి, శామీర్పేట్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.


## ఉప్పల్ సర్కిల్ బిఆర్ఎస్వి అధ్యక్షుడిగా వినయ్ కుమార్ యాదవ్

### నియామక పత్రం అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ డిసెంబర్ 01 ( జనం సాక్షి ): బిఆర్ఎస్వి ఉప్పల్ సర్కిల్ అధ్యక్షుడిగా వినయ్‌నీ ప్రకటించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. చంద్రధర్, ఉపాధ్యక్షుడిగా, మోహన్ కాప్రా ఉపాధ్యక్షుడిగా, వరుణ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.మీరు అందరూ విద్యార్థుల హక్కుల కోసం మరియు పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని ఆశిస్తున్నాను అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గీత ప్రవీణ్ ముదిరాజ్ బి ఆర్ ఎస్ వి నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించండి

**కోట్ పల్లి ఎస్ఐ శైలజ**



**కోట్ పల్లి డిసెంబర్ 01(జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నియా నియమాలను పాటించాలని కోట్ పల్లి ఎస్ఐ శైలజ అన్నారు. సోమవారం ఆమె ఓ ప్రకటనలో మాట్లాడుతూ...... ఎన్నికల సందర్భంగా మండలంలో 163 బి ఎన్ ఎస్ ఎస్ (144) సెక్షన్ అమల్లో ఉంటుందని వాహనదారులు నిబంధనలు పాటించాలని చెప్పారు. ఎవరైనా గొడవలు సృష్టించిన, సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.అలాగే లావాదేవీల వివరాలు లేకుండా అధిక మొత్తంలో నగదును తరలిస్తే సీజ్ చేస్తామని, వ్యక్తిగతంగా రూ.50 వేలకు మించి వాహనాలు తీసుకెళ్లిన స్వాధీనం చేసుకుంటా మనీ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ డిసెంబర్ 17వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని పేర్కొన్నారు.

# అల్వాల్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సుడిగాలి పర్యటన



**అల్వాల్, డిసెంబర్ 1 (జనంసాక్షి):** అల్వాల్ డివిజన్ అభివృద్ధిని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన సోమవారం డివిజన్‌లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రగతి కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లో పార్క్ అభివృద్ధి, ట్రాన్స్ఫార్మర్ మార్పిడి, గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మల తొలగింపు, బాటల పక్కన ఉన్న పొదల శుభ్రపరిచే పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. రోడ్ నం.7లో రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని, కొంతకాలంగా పనిచేయని స్ట్రీట్‌లైట్లను పునరుద్ధరించాలని అన్నారు.అల్వాల్ డివిజన్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సందీప్ కుమార్, దివాకర్, నిర్మల్ రెడ్డి, ప్రదీప్, జనార్దన్ రావు, దీప మురుగన్, సోను సింగ్, చిరంజీవి, దామోదర్ రావు, రాజేందర్, లక్ష్మయ్య, నాయకులు నరేందర్ రెడ్డి, శరణగిరి, ప్రేమ్ కుమార్, సాజిద్, లోకేష్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దారుణ హత్య

ఓయూ డిసెంబర్ 01 ( జనం సాక్షి ): గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా హత్య చేసి ఆటోలో వచ్చి పడేసి వెళ్లిన దుండగులు తార్నాక ప్రాంతంలోని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా హతమార్చి, ఆటోలో వచ్చి మృతదేహాన్ని ఎర్రకుంట సమీపంలో పడేసిన దుండగులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.